
4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 24 ఫిబ్రవరి 2025
www.ntnews.com

# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# నేటికీ నాటకం ఆచరణీయమే

**సాహిత్య ప్రక్రియల్లో నాటకానికి విశిష్ట స్థానం ఉంది. అందుకే మహాకవి కాళిదాసు 'నాటకాంతం హి సాహిత్యం' అన్నారు. అనగా అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ చివరిగా స్పర్శించవలసిన అంకం నాటకం అని అర్థం. నాటకం, బాణ, ప్రకరణ, ప్రహసన, డిమ, వ్యాయోగ, సమవాకార, వీథి, అంక, ఈహామృగ వంటి దశ రూపకాలలో నాటకం ఉత్తమమైనది. శ్రవణ సహిత దృశ్య రూపకం నాటకం.**



కాకతీయుల కాలంలో ప్రదర్శించిన క్రీడాభిరామం కూడా ఒక నాటకమే అని చెప్పవచ్చును. అయితే క్రీడాభిరామంలో నాటక లక్షణాలు లేవని కొందరంటారు. మహా పండితులు చెప్పిన నాటక లక్షణాలు సమస్తం అనుసరిస్తూ నాటకం వ్రాయడం, ప్రదర్శించడంలో తప్పులేదు కానీ భాస మహాకవి వంటి వారు వ్రాసిన 'ఊరు భంగం', 'దూత వాక్యం', 'కర్ణ భారం', 'దూత ఘటోత్కచం', 'పాంచరాత్రం', 'అవిమారకం', 'స్వప్న వాసవదత్తము' వంటి రచనలలో నాటక లక్షణాలు సమస్తం ఉండవు అని కొందరు పండితులు అంటారు.

**నాటకంలో పదిమందిని ఆకర్షించే సన్నివేశాలు, చక్కని సంభాషణలు, ఆకర్షణీయమైన సంగీతంతో కూడుకున్న పద్యాలు, పాటలు, రంగస్థలంపై ఉన్న నటుల నటన పదిమందిని ఆకర్షిస్తే అలాంటి నాటకాలన్నీ ప్రజాదరణ పొందుతూనే ఉంటాయి. అప్పుడు పండితులు చెప్పిన నాటక లక్షణాలు లెక్కలోకి రావు. నిజం చెప్పాలంటే పండితుల నాటక లక్షణాలకు ప్రజాదరణ పొందిన నాటక లక్షణాలకు సంబంధం ఉండదు..**

నాటక లక్షణాలలో నాయకుడు ఉత్తముడై ఉండాలి అంటారు. దుష్యంతుడు, హరిశ్చంద్రుడు వంటి నాయకులు ఉత్తములా? అంటే ఎవరి అభిప్రాయం వారిది. ఎవరు ఉత్తములు? ఎవరు మధ్యములు? ఎవరు అధములు? అనే చర్చోపచర్చలు మహా పండితుల నడుమ సాగుతుంటాయి. ఎక్కువ శాతం, నాటక ప్రజాదరణ, పండితుల చర్చోపచర్చలకు భిన్నంగా ఉంటుంది. ఏదేమైనా ఒకప్పుడు తెలుగు నాటకాలు ప్రజలను విపరీతంగా ఆకర్షించాయి. తెలుగు తొలి నాటకం 1860 ప్రాంతాన కోరాడ రామచంద్రశాస్త్రి గారు వ్రాసిన 'మంజరీ మధుకరీయం' అని నాటక చరిత్రకారులు చెబుతున్నారు. తెలుగులో అభిజ్ఞాన శాకుంతలం, నరకాసుర విజయం, వేణీ సంహారము, గయోపాఖ్యానం, ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం, పాదుకా పట్టాభిషేకం, హరిశ్చంద్ర, పాండవోద్యోగ విజయాలు, బొబ్బిలి యుద్ధం, పల్నాటి యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం, ప్రమీలార్జునీయం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, శ్రీరామాంజనేయ యుద్ధం, లవకుశ, భక్త రామదాసు, భక్త ప్రహ్లాద, సతీ అనసూయ, సతీ సావిత్రి, చింతామణి, వరవిక్రయం, నర్తనశాల, శ్రీమత్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, అల్లూరి సీతారామరాజు, ఛత్రపతి శివాజీ, కురుక్షేత్రం, మాభూమి, కీర్తి శేషులు, రంగూన్ రౌడీ, వసంతసేన, వంటి తెలుగు నాటకాలు ఒకప్పుడు దేశవిదేశాల్లోని అనేక రంగస్థలాలకు వన్నె తెచ్చాయి. ఒక లెక్క ప్రకారం తెలుగులో పౌరాణిక చారిత్రక సాంఘిక జానపదాది నాటకాలు రమారమి నాలుగు వేల పైనే అన్న మాటల్లో ఆవంత కూడా అతిశయోక్తి లేదు.

రామాయణ, భారత, భాగవతాదులలో కూడా లేని సంఘటనలు మన తెలుగు పౌరాణిక నాటకాలలో ఉన్నాయి. ఆ కల్పిత సంఘటనలే నిజమన్న సామర్థ్యాన్ని సంతరించుకున్నాయి. ఒకప్పుడు తెలుగు నాటకాలకు అంత శక్తి ఉంది.

శ్రీరామాంజనేయ యుద్ధం, శశిరేఖా పరిణయం, సీత అగ్నిప్రవేశం, వాల్మీకి ఆశ్రమంలో లవకుశులు, శ్రీరామ శంబూకుల యుద్ధం, కర్ణుని నాయక తేజం వంటి అనేకానేక అంశాలు రామాయణ భారత భాగవ తాదులలో వేరే రకంగా ఉంటాయి. భాగవత పురాణంలో హరిశ్చంద్రుడు సత్య హరిశ్చంద్రుడు అన్నట్లు ఉండ దు. కానీ మన తెలుగు నాటకాలు అనేకానేక పురాణ పాత్రలను మహోన్నత నాయకులుగా తీర్చిదిద్దాయి. ఈ పౌరాణిక చారిత్రక సాంఘిక నాటకాలే తర్వాత తర్వాత సినిమాలుగా వచ్చాయి. ఆ సినిమాలు కూడా అధిక శాతం విజయవంతమయ్యాయి.

కొన్ని కొన్ని తెలుగు సాంఘిక సినిమాలలో పౌరాణిక జానపద చారిత్రక ఛాయలు ఉంటాయి. ఉదాహరణకు భాసుని స్వప్న వాసవదత్త నాటకమున వాసవదత్త అవంతిక పేరుతో పద్మావతి దగ్గర ఉంటుంది. ఆమెను పద్మావతీ దేవి దగ్గరకు మంత్రి యౌగంధరాయణుడు తీసుకువస్తాడు. ఆ సంఘటన ఛాయయే సంప్రదాయం అనే తెలుగు సినిమా మూల కథ అనిపిస్తుంది. ఇలాంటి ఛాయలు మన తెలుగు సినిమాలలో చాలా కనపడతాయి. అలాగే శ్రీకృష్ణ తులాభారం కథాఛాయ శుభలగ్నం అనే సాంఘిక సినిమాలో కనపడుతుంది. శమంతకమణి పౌరాణిక వృత్తాంతానికి ఛాయారూపంగా ఎన్.టి.ఆర్. వేటగాడు సినిమా ఉంటుంది. ఇలా పౌరాణికాది కథల ఛాయతో సాంఘిక సినిమాలు రావడం తప్పు కాదు. అయితే పౌరాణిక పాత్రల ఔచిత్యం దెబ్బ తినేటట్లు పౌరాణిక సినిమాలు రావడం మాత్రం మంచిది కాదు. నేడు తెలుగునాట దుష్టచతుష్టయం లోని ఒకడైన కర్ణుడు కొందరికి నాయకుడుగా కనపడతాడు. నిజానికి వ్యాస భారతం చదివితే ఆ భావన రాదు. పౌరాణిక పాత్రల గుణగణాలను లెక్క కట్టేటప్పుడు యుగధర్మా దులన్నీ గమనించాలి. వ్యాస భగవానుడు ఆ పని చేసాడు. కలియుగ నాటక రచయితలు, సినిమా రచయిత లు ఆ పని చేయలేదు.


**శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, పౌరాణిక కథా పరిధులు పెరిగిన ఆధునిక కాలంలో, స్వయంప్రభ, ప్రమద్వర, ఉలూక రాయబారం వంటి పౌరాణిక నాటికలు, బాసర సరస్వతి చరిత్ర, శ్రీ కాళేశ్వర క్షేత్రమహిమ, ఆర్యభట్ట, వరాహమిహిర, భాస్కరాచార్య ,శ్రీనివాస రామానుజన్, మహావీరాచార్య, బ్రహ్మగుప్త వంటి నాటికలు అక్కడక్కడ ప్రభుత్వేతర పాఠశాలల్లో విద్యార్థుల చేత ప్రదర్శింపబడుతూనే ఉన్నాయి. అయితే ఒకప్పటి తెలుగు నాటకాల ప్రదర్శనల్లా ఇప్పుడు తెలుగు నాటక ప్రదర్శనలు ఉండటం లేదన్నది నిజం.**

అక్కడక్కడ కొన్ని నాటక పరిషత్తుల వారు నాటక పోటీలను ప్రోత్సహిస్తూ, వర్తమాన సాంఘిక నాటకా లకే ప్రాధాన్యతను ఇస్తున్నారు. కొత్తగా ఆలోచించలేక పోతున్నారు. నేడు నాటకాలకు ఆదరణ కరువైంది. అయితే ఆయా సాంస్కృతిక ప్రదర్శనలు అధికశాతం సినిమా పాటలకు , షోకేస్ బొమ్మల్లా విద్యార్థులను తయారు చేయడానికి పరిమితం అవ్వడం విచారించవలసిన విషయం. విద్యార్థులతో శాస్త్ర సాంకేతిక పౌరాణిక విజ్ఞాన తెలుగు నాటికలను ప్రదర్శింప చేయడం వలన విద్యార్థులలో తెలుగు భాషా ఉచ్చారణ సామర్థ్యం పెరుగుతుంది. భాషపై పట్టు వస్తుంది. విషయ అవగాహన మీద పట్టు పెరుగుతుంది. బట్టీ తత్వం తగ్గి పరిశోధనా తత్వం పెరుగుతుంది. మన భారతీయ శాస్త్ర సాంకేతిక విజ్ఞాన పరిధులను తెలుగు నాటికల ద్వారా పెంచవచ్చును. అప్పుడు భారతీయ శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ప్రయోగశాలల వైపు పయనమవుతుంది. ఇలా చేయగలిగితే మన తెలుగు నాటక తేజం శాస్త్రీయ పథాన వికసిస్తుంది. ■

**తెలుగు నాట ఒకప్పుడు పౌరాణిక నాటకాల కథాంశాలే అసలు రామాయణ, భారత, భాగవతాదులలోని కథాంశాలు అనుకుంటే, ఆ తర్వాత పౌరాణిక సినిమాలే అసలు రామాయణ, భారత, భాగవతాదులలో కథాంశాలు అని అధికశాతం తెలుగువారు అనుకునే వారు. నేడు పౌరాణిక సినిమాల ప్రభావం తగ్గిపోయింది. ఏదేమైనా పౌరాణిక సినిమా నాలెడ్జే పురాణ నాలెడ్జ్ అని పొంగి పోవడం అశాస్త్రీయం అవుతుంది.**



వాగుమూడి లక్ష్మీ రాఘవరావు
62814 90160





## ముసాఫిర్ ఖానా

ఎంత నడిచినా
వేగంగా పరిగెత్తినా
పట్నం
సాయంకాలానికి అలిసిపోదు
ఆవలింతలు తీయదు

పొద్దటికంటే కూడా
ఎక్కువ చైతన్యాన్ని పుంజుకుంటుంది

రోడ్లకు వాహనాల వరదొస్తుంది
ఆ ప్రవాహానికున్న రెండు తీరాలూ
ఇంద్రధనుస్సుల్లాంటి దీపాలతో
కాంతివంతమవుతాయి

పైన ఆకాశాన్ని చీకటి కప్పేస్తే
నగరం వెల్తురు పందిరవుతుంది
వెలుగూ వేగం రైలు పట్టాలవుతాయి

నేనేమో వలస పక్షిలా
పద్మవ్యూహాన్ని చీల్చుకుంటూ
తిరుగుముఖం పడతాను
ఠికానా చేరుతాను


ఎగిరే పక్షికి బాల్కనీలోని
పంజరం గూడు కానట్టే
నాకూ ఠికానా ఇల్లు కాదు
నగరమే ఓ పెద్ద ముసాఫిర్ ఖానా



వారాల ఆనంద్

**సాహిత్యాభిలాషను విమర్శ బ్రతికించాలి (చెలిమె 10. 02. 25) శ్రీ రామ్ పుప్పాల వ్యాసం చదివాక అందులో నన్ను ప్రస్తావించడమే కాక నన్ను సమర్థించడానికే వంశీకృష్ణ గత వ్యాసం రాసాడని ఆరోపించడం సమంజసం కాదనిపించింది. అందుకే నావైన రెండు మాటలు చెప్పితీరాలనిపించింది. శ్రీరాం వ్యాసంలో చాలా చోట్ల తప్పులో కాలు వేశాడనిపించింది.**

# ఇమేజ్ ఓ మాయా దర్పణం



నన్ను సమర్థించడానికే వంశీ కృష్ణ వ్యాసం రాశాడని అనుకుంటే శ్రీరామ్ తన వ్యాసాన్ని అనిల్ డ్యానీని సమర్థించడానికి రాశాడని నేనూ అనొచ్చు. కానీ అనను. చెత్తను చెత్త అని అంటే తప్పేమిటి అని డ్యాని గురించి ఎవరో అడిగిన ప్రశ్న శ్రీరామ్‌కు తప్పుగా అనిపించడం వెనుక కూడా డ్యానీని సమర్థించడమే ఉందని నేనన్చొచ్చు. కానీ అనను.

నీలిమ సరైన విమర్శే చేసిందని సాహిత్య ప్రపంచం అనుకోవాలని వంశీకృష్ణ తాపత్రయపడుతున్నాడు. అనడం కూడా పరోక్షంగా శ్రీరామ్ నన్ను అవమానించడమే. నీలిమ విమర్శ ఎక్కడ సరిగ్గా లేదో శ్రీరామే చాకిరేవు పెట్టొచ్చుకదా. ప్రసేన్ గురించో, నీలిమ గురించో ప్రస్తావించిన వ్యక్తి మాత్రం శ్రీరామ్‌కు అమూర్తంగా కనపడతాడు. సీరియస్ పాఠకుడెప్పుడూ అమూర్తంగానే వ్యాఖ్యానిస్తాడనే విషయం శ్రీరామ్‌కు తెలియకపోవడం ఆశ్చర్యమే.

వంశీ వ్యాసంలో నాకు సంబంధించని అనేక అంశాల ప్రస్తావన కూడా ఉంది. అవేవీ శ్రీరామ్‌కు కనపడలేదు. శ్రీరామ్‌కు కనపడని కొన్ని అంశాల గురించి నేనిక్కడ ప్రస్తావిస్తాను.

కవులకు ఇమేజ్ సమస్యలు ఉన్నాయేమో అని ఆయన వాపోవడం ఆశ్చర్యం వేసింది. ఆ పోలికే అసమంజసంగా వుంది. ఇమేజ్‌లు అభూత కల్పన కాదా అన్నది శ్రీరామ్ సందేహం.

**నిజమే ఇమేజ్‌లు అభూత కల్పనలే. కానీ కవులకు అదే కావాలి కదా. ఆ ఇమేజ్ లేకపోతే శ్రీశ్రీ మహాకవి, శేషేంద్ర యుగకవి, తిలక్ అనుభూతి కవీ అయ్యే వాళ్లు కాదు కదా. యువకవుల పురోగమనాన్ని వాళ్లకున్న ఇమేజ్ దెబ్బతీస్తున్నదేమో అని వంశీకృష్ణ సందేహపడ్డాడు. అంతే తప్ప అందులో అసమంజసమేమీ లేదు.**

'ముందుమాటలు, బ్లర్బ్‌లు ఇలానే ఉండాలనే ఏ సూత్రీకరణ లేదు అంటూనే, వంశీ ఒకచోట పరిమితులు వున్నాయ్ అంటారు. మరొక చోట ఎక్కడా విమర్శ చేయకూడదని లేదు' అంటారు అన్నాడు శ్రీరామ్.

నాకైతే ఇందులో గందరగోళం ఏమీ కనపడలేదు. ముందుమాటలు, బ్లర్బ్‌లు ఇలానే ఉండాలనే ఏ సూత్రీకరణ లేదు. ముందుతరం వాళ్లు ముందుమాటల్లోనే ఎక్కువ విమర్శ చేశారు. కానీ కొత్తతరం ముందు మాటల్లోకానీ, బ్లర్బ్‌లలో కానీ పొగడ్తలు తప్పిస్తే విమర్శ చేయడం లేదు. అదొక అప్రకటిత సంప్రదాయంగా మారింది. గత పాతికేళ్లలో దాన్నెవరూ బ్రేక్ చేయలేదు. ఆ అప్రకటిత సంప్రదాయాన్నే పరిమితి అని వంశీకృష్ణ అన్నాడు. ఏ సూత్రీకరణ లేదు అనటం ఆదర్శం. పరిమితులు వున్నాయ్ అనటం ఆ ఆదర్శ సాధనకై చేస్తున్న ఆచరణలో అనుసరిస్తున్న పరిమితి అనే విషయం శ్రీరామ్ అర్థం కాలేదా? కానట్టు నటిస్తున్నాడా?

రిజర్వేషన్ల తోడ్పాటు ఇప్పటికే కాదు, ఎప్పటికీ అవసరమేనని శ్రీరామ్ తెలుసుకోవాలి. దళిత, స్త్రీవాద, బహుజన, ముస్లిం, ఆదివాసీ కవిత్వ ఉద్యమాలు తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించి బాల్యావస్థను దాటి సొంత గొంతును, వ్యక్తిత్వాన్ని సాధించుకున్నాయి కనుక శేషం లక్ష్మీపతిరావు చెప్పిన మినహాయింపు అవసరం లేదు అని వంశీకృష్ణ భావన. ఆ మినహాయింపుల వెలుగులో వాటిని మూల్యాంకనం చేయరాదన్నది అతని అభిప్రాయం. తండ్రి చేయి పట్టుకుని కొంతకాలం మాత్రమే పిల్లాడు నడవాలి. దళిత, స్త్రీవాద, బహుజన, ముస్లిం, ఆదివాసీ కవిత్వం మీద సరైన విమర్శ రాలేదు అన్నది వంశీ అభిప్రాయం కాదు. శ్రీరామ్‌కి భిన్నమైన అభిప్రాయం ఉంటే అది స్వాగతించదగిందే.

'కొత్త తరం రచయితలను ఉటంకిస్తూ వాళ్లందరూ ఏ నెగటివ్ విమర్శా చేయలేదంటారు. వంశీకృష్ణ మాత్రం ఏ నెగటివ్ విమర్శ చేసినట్టు భావించాలి?' అని అడిగాడు శ్రీరామ్.

వంశీ చాల తక్కువ విమర్శ రాశాడు. ఆ రాసిన సందర్భాలలో కూడా చాలా మేరకు నెగటివ్ విమర్శ చేశాడు. తను చేసినవన్నీ ఎక్కువ పరిచయాలు, అవలోకనాలు. అవేవీ సీరియస్ సాహిత్య విమర్శ కాదు. ఇది అతని విమర్శ మీద నాకున్న అభిప్రాయం. ఇదే అభిప్రాయాన్ని పెద్దన్న చేసిన ఇంటర్వ్యూలో వంశీకృష్ణ స్వయంగా చెప్పుకున్నాడు కూడా. అఫ్సర్ డియర్ మేరీ కథను వంశీకృష్ణ విమర్శించాడు కదా. అమ్మ డైరీలో కొన్ని పేజీల లోపాన్ని వివరించాడు కదా. దేశరాజు కథలు, కే.జీ. వేణు కథలులో దృక్పథ లోపాలను చెప్పాడు కదా. ఇవి ఉదాహరణకి కొన్ని మాత్రమే. ఇంకా చాలా సందర్భాలలో వంశీకృష్ణ నెగటివ్‌గా రాశాడు.

**'వంశీకృష్ణ నీలిమను సమర్థించడానికే ఈ వ్యాసం రాస్తే ఇబ్బంది లేదు. అనిల్ డ్యాని, లండ సాంబమూర్తి, నాంపల్లి సుజాతలను తక్కువ చేశారు' అన్నది శ్రీరాం మరో ఆరోపణ.**

ఒకవేళ నిజంగానే నీలిమను సమర్థించడానికి వ్యాసం రాసి ఉంటే పైన చెప్పిన శ్రీరామ్ అభ్యంతరాలు అన్నీ మాఫీ అయిపోతాయా? అనిల్ డ్యాని ఎనిమిదో రంగు మీద తప్ప మిగతా పుస్తకాల మీద వంశీకృష్ణ ఏమీ రాయలేదు. లండ సాంబమూర్తి, నాంపల్లి సుజాతల గురించి కూడా రాయలేదు. నా వ్యాసాలకు వాళ్ల ప్రతిస్పందనలను తను ఉటంకించాడు. అంతే. వాటిని తనకు అర్థం అయిన రీతిలో ఇంటర్‌ప్రెట్ చేశాడు. శ్రీ రాం డ్యానీని సమర్థిస్తూ ఇంటర్‌ప్రెట్ చేసినట్టన్నమాట. ఇంటర్‌ప్రెటేషన్ తప్పయితే తప్పని చెప్పండి. అసలు ఇంటర్ప్రెటేషనే తక్కువ చేయడం అనే అభిప్రాయం మీకుంటే ఎవరూ ఏమీ చేయలేరు.

'విమర్శా రంగాన్ని శుభ్రపరిచే వ్యాఖ్యలు చేయక్కరలేదు. ఇమేజ్ చట్రంలో చిక్కుకున్నారని కవులను నిందించనక్కర లేదు' ఇది శ్రీరామ్ మరో వ్యాఖ్య.

**ఒక వేళ వంశీ వ్యాఖ్యలు విమర్శా రంగాన్ని శుభ్రపరిచేలా ఉంటే, అది శ్రీరామ్‌కు నచ్చకపోతే ఆ పనేదో ఆయననే చేయమనండి. శ్రీరామ్ విమర్శా రంగాన్ని శుభ్రపరిచే వ్యాఖ్యలు చేయనక్కర లేదు అని ఎవరూ అనరు.**

ఇమేజ్ అందరూ వద్దు అంటూనే కావాలనుకునే మాయా దర్పణం. అదేమీ నిందాపూర్వక పదం కాదు.

ఒక స్త్రీ ఏదైనా రాస్తే ఆమెను రాయనియ్యకపోవడం కొత్తేమీ కాదు. అందుకు అనుసరించే మార్గాలే కొత్త కొత్తవి. ఇప్పుడు నన్ను ఎవరో సమర్థిస్తున్నారనీ నారాతలు సరైనవేనని నిరూపించడానికి ఎవరో తాపత్రయపడుతున్నారనీ అనడం కూడా ఆ కొత్త పద్ధతుల్లో ఒకటి. అయినా నేను నాలానే రాస్తాను. ఆగను. ■



నీలిమా
వి. ఎస్ రావు



## సశేషం

నీవు
ఆత్మజ్ఞానంలోకి రావాలి
నీవు
చీకటి వెలుగుల సాలెగూడులో
పడి గిలగిల కొట్టుకుంటున్నావు
చీకటిని చీల్చలేవు
వెలుగులోకి రాలేవు
నీవొక రెక్కలు విరిగిన పక్షివి
నీవొక దివాంధ జ్ఞానలోకంలో
డేరావేసుకుని కూర్చున్నావు
కర్మ వికర్మల విధి వంచితుడవు...
దుఃఖం భయం సదనంలో
బందీవై పడి ఉన్నావు
నీ కథ కంచికి చేరదు
మంచానికి పరిమితమై
వీపున పుండ్లు పడి
దురదకు చేతులందక
అచేతనం లోకి వెళ్లిపోతావు...

నీవు ఎదిగే క్రమం
అతేంద్రియ శక్తుల
వలలో నెట్టబడి
జీవితం చిత్తడైయింది
అందుకే అందుకో
వాస్తవాల నిచ్చెన
చేరుకో గలవు
ఆశలదరి



రేడియమ్
92915 27757

## అంబేద్కర్ తాత్వికతకు అక్షర పతాకం

# కోయి 'నాగస్వరం'





ప్రకాశం జిల్లాలో ఎక్కడో మారుమూల పల్లెటూళ్లో పుట్టి, దళిత జీవితాన్ని అనుభవిస్తూ, పసితనంలోనే తల్లి ప్రేమకి దూరమై తనను తాను నిలబెట్టుకోవడానికి తెలుగు సాహిత్య యవనిక మీద కవిగా అడుగుపెట్టి అటు విమర్శలో, ఇటు కవిత్వంలో తనదైన దిశలో ముందుకు పోతున్న కవి కోయి కోటేశ్వరరావు. గుండెడప్పు సంకలనం కోయి కోటేశ్వరరావుని కవిని చేసింది. తను రాసిన కవితే గుండెడప్పు దళిత సంకలనానికి శీర్షికయింది. కోయిది దళిత గ్రామీణ నేపథ్యం. బాల్యంలో నాన్న పడ్డకష్టం చూసి ఆ నాన్నని చెయ్యారా తడుముకున్నాడు. ''అయ్య చెమటచుక్కలు పరిచిన రహదారి పైనే కదా/నేనంటూ ఇక్కడిదాకా నడిచి వచ్చాను/నాకే కాదు మా ఊరి అన్నదాతకి కూడావెన్నెముక మా అయ్యే/ ఊరికి కూడా మా అయ్యే వెన్నెముక'' అంటున్నాడు. అన్నదాత అంటే అగ్రకుల రైతు భూస్వాముల జాబితాలే కనబడతాయి. వాటివెనక నిలబడే దళిత కూలీల ముఖచిత్రాలన్నీ దాయబడతాయి. నాగస్వరంలోని కవిత్వం దళిత తత్వంతో మార్మోగింది.

**''పదిమంది కష్టాన్ని కొల్లగొట్టి/పండగ చేసుకోవడమే నేటి యుగ ధర్మం''. ఈ వాక్యాన్ని డీకోడ్ చేయండి. ఇందులో వ్యాపార లక్షణం కనబడుతుంది. ఆర్థిక సంస్కరణల పేరుతో మన ఇంటి ముందుకు వచ్చిన ప్రపంచీకరణ పాఠం ఉంది. ఆధిపత్యం అనేది కేవలం కులంలో మాత్రమే కాదు, అది అన్ని చోట్లా ఉందనే నిజాన్ని సోదాహరణంగా చాటి చెబుతుంది 'నాగస్వరం' కవిత.**

'కరుణ, ప్రేమ, ఆగ్రహాలను వ్యంగ్య రూపంలో చెప్పడం పెద్ద సాహసమే. కొంచం అతి జరిగినా మొత్తం లక్ష్యం దెబ్బ తింటుంది. భావసాంద్రత పలచబడి పోతుంది. కానీ కోయి ఏమాత్రం కష్ట పడకుండా ఈ సాహసకృత్యాన్ని సునాయాసంగా చేయగలిగాడు. అందుకు రూపకాన్ని శక్తివంతంగా వాడుకున్నాడు' అని కలేకూరి ప్రసాద్.. కోయి కవితల వెనక ఉన్న మర్మాన్ని చెప్పాడు. 'ఒక మర్డర్ ప్లీజ్' అనే కవితలో ''దయచేసి ఎవరైనా పట్టపగలు పబ్లిగ్గా ఒక మంచి మర్డర్ చేస్తారా?/సాటి మనిషి దేహంపై వేటకొడవళ్లు చేసే రక్త నాట్యం నేత్రపర్వంగా దర్శించాలి/ఉన్నపళంగా ఒక వేడివేడి వీడియో తీసి లక్షలాది లైకులు కొల్లగొట్టాలి'' అని రుచీపచీ లేని సోషల్ మీడియా పనితనాన్ని ఎండగడతాడు.

**''ఊరందరికి మా అయ్య బానిసైతే/మా అమ్మ మా అయ్యకి కూడా బానిసే'' ఎంత హృదయ విదారకమైన మాటిది. ఇందులో దళితతత్వం ఉంది, అమ్మతనం ఉంది. వెనుకబాటు తనపు అనుభవం లోనుంచి అమ్మని చేతుల్లో పెట్టుకుని ముద్దాడుతున్నాడీ కవి. ఈ సంపుటిలో స్త్రీ చాలా సందర్భాల్లో కనబడుతుంది.**

కోయి కోటేశ్వరావుని వస్తు పరిణతితో పాటుగా శిల్ప పరిణతి సాధించిన కవిగా మనం గమనించొచ్చు. ఈ సంపుటికి ముందు మాటలు రాసిన ప్రొఫెసర్ శిఖామణి ఈ కవిత్వాన్ని చెయ్యారా కౌగిలించుకున్నాడు. కార్ల్ టాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జంగం చిన్నయ్య ప్రేమగా రాసిన ఆంగ్ల ముందు మాట చదివిస్తుంది. ''నేనే నిజమైన దేశ భక్తుణ్ణి/నాగజాతి రక్త సంతకాన్ని నేను/దమ్మపథ బాటసారిని నేను/సత్య' జ్యోతి' కిరణాన్ని/నేను 'భీమ' పతాకాన్ని/నాది నాగ స్వరం'' అంటూ తనదైన కవిముద్రని తెలుగు సాహితీ యవనికపై వేసిన కోయి కోటేశ్వరరావుకు శుభాకాంక్షలు. 'నాగస్వరం' ఒక దుఃఖ రాగం. నిరసన గానం. అన్నింటికీ మించి బుద్ధుడు, జ్యోతిరావు పూలే, అంబేద్కర్ అందించిన తాత్వికతకు అక్షర పతాకం 'నాగస్వరం'. రాజ్యాంగ నైతికతను చాటి చెప్పే ఇలాంటి మేలుకొలుపు కవిత్వం మరింతగా రావాలని కోరుకుందాం. ■



అనిల్ డ్యాని
97033 36688

### పురస్కార ప్రదానం

**ఫిబ్రవరి** 24న సోమవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్, ప్రభుత్వ సిటీ కాలేజీలోని ఆజామ్ హాల్‌లో 'సిటీ కాలేజీ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారం 2025' ప్రదానోత్సవ సభ జరుగనున్నది. ఈ పురస్కారాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్ స్వీకరిస్తారు. ప్రిన్సిపాల్ పి.బాలభాస్కర్ అధ్యక్షతన జరిగే ఈ సభకు ముఖ్య అతిథిగా వెల్దండ నిత్యానంద రావు, అతిథులుగా అమర్, యాకూబ్, దేవేందర్ రానున్నారు. డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్ ఏలూరి యాదయ్య, డాక్టర్ కోయి కోటేశ్వరరావు సభను సమన్వయం చేస్తారు.

### కథలకు ఆహ్వానం

**'భూపతి** చంద్ర' స్మారక సంస్థ కథానికల పోటీకి రచనలను ఆహ్వానిస్తున్నాం. సమకాలీన, సామాజిక సమస్యలను ప్రతిబింబించేవిగా ఉంటూ, హాస్యాన్ని మేళవించగలిగితే మంచిది. ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు, తృతీయ రూ.2 వేలు, వెయ్యి చొప్పున ఐదుగురికి బహుమతులుంటాయి. చిరునామా 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ, ఆనంద నిలయం, ఇ.నెం. 1-5-1020/4, బి.ఆర్.రావు నగర్, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్-10, సెల్: 99636 16999

- ఎం.ఎల్. కాంతారావు

### జాతీయ సాహిత్య సదస్సులు

**2025,** మార్చి 1, 2వ తేదీలలో హైదరాబాద్, రవీంద్ర భారతిలోని మొదటి అంతస్తులో 'తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ-అక్షరయాన్, సీతాస్, అభిజ్ఞ భారత్ సంస్థల సంయుక్త నిర్వహణలో జాతీయ సదస్సులు జరుగనున్నాయి. ఇందులో భాగంగా.. 'జాతీయ సాహిత్య సదస్సులు' 'వారసత్వ దీప్తుల పురస్కారాలు', 'ఆ తరం రచయిత్రుల జీవన ప్రస్థానంపై ఈ తరం రచయిత్రుల పత్ర సమర్పణలు', 'సాహిత్య పురస్కారాలు' వంటి కార్యక్రమాలు జరుగనున్నాయి. పలువురు ప్రముఖులతో పాటు సాహితీవేత్తలు హాజరుకానున్నారు. అందరికీ ఆహ్వానం.

- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ